క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



డోర్నకల్: డోర్నకల్ మోడల్ స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థినులు ఆర్.షణ్ముకప్రియ, బి.దీపిక, పి.గీతిక అండర్–19 ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 6నుంచి మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రిన్సిపాల్ కృష్ణభాను, పీఈటీ గోవర్ధన్ అభినందించారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సమక్షంలో మహబూబాబాద్ మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ కోల సత్యం, గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు హెచ్చు వెంకటేష్, మరికొంత మంది శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిట్టకంటి రామిరెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

జేడీకి సన్మానం



మహబూబాబాద్ రూరల్: వ్యవసాయ శాఖ వరంగల్ జాయింట్ డైరెక్టరుగా బాధ్యతలు తీసుకున్న ఉప్పల శ్రీనివాస్ శుక్రవారం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర దడవాయిల సంఘం అధ్యక్షుడు సరసాని సురేందర్ రెడ్డి, కేసముద్రం మార్కెట్ అధ్యక్షుడు చింతల ఉప్పలయ్య, మంగీలాల్, ఇతర సభ్యులు శాలువాతో సత్కరించారు. తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జేడీని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలంలో బీఏ, బీకాం, బీఎస్సీ, డిగ్రీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరం ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్, కోఆర్డినేటర్ హత్తిరాంనాయక్ శుక్రవారం తెలిపారు. అభ్యర్థుల అర్హత రెగ్యులర్ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి ఉండాలని, పాలిటెక్నిక్, ఐటీఐ డిప్లొమా కోర్సులు పాసై ఉండాలన్నారు. చివరి తేదీ ఈనెల 15వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు 73829 29705 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఫ్లెక్సీతో జాబ్ మేళా ప్రచారం



గార్ల: మహబూబాబాద్‌లో ఈనెల 8న జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ కోరారు. ఈమేరకు శుక్రవారం ఆటోలకు మెగా జాబ్‌మేళా ఫ్లెక్సీలను కట్టించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శ్యామ్, కానిస్టేబుళ్లు శ్రీను, సిరాజ్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

బయ్యారం: జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు వినియోగించుకోవాలని ఎస్సై తిరుపతి శుక్రవారం తెలిపారు.

కరెన్సీ నోట్లు అమ్మబడును..!



డోర్నకల్: ఒరిజినల్ కరెన్సీ నోట్లను పోలిన నోట్లను డోర్నకల్ మెయిన్ రోడ్డులోని పలు దుకాణాల్లో కట్టలు కట్టలుగా విక్రయిస్తున్నారు. దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులు కరెన్సీ నోట్లను కట్టలుగా కొనుగోలు చేసి కరెన్సీ నోట్లతో దుర్గామాతను అలంకరిస్తున్నారు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు

- పెడ్‌కే పరిమితమవుతున్న మృతదేహాలు తరలించే వ్యాన్
- ఫ్రీజర్లు లేకపోవడంతో తప్పని ఇబ్బందులు



ప్రభుత్వ ఆస్పత్రి ముందు ప్రైవేట్ వాహనాలు

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మరణించిన వారి మృతదేహాలను తరలించాల్సిన వాహనం ఎప్పుడూ రిపేర్‌లోనే ఉంటుంది. ఆస్పత్రిలో అందుబాటులో ఉంటూ సేవలందించాల్సిన వాహనాలకు జబ్బు చేసింది. నిత్యం రిపేర్లు అవుతుండడంతో షెడ్‌కు తరలించి రిపేర్లు చేయిస్తున్నారు. దీంతో సేవలు నిలిచిపోవడంతో ఆస్పత్రిలో మరణించిన మృతదేహాలను తరలించేందుకు ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. ప్రైవేటు వాహన యజమానులు రోగుల జేబులు ఖాళీ చేస్తున్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయిన ఆస్పత్రిలో మృతదేహాన్ని భద్రపరిచేందుకు ఫ్రీజర్లు లేకపోవడంతో వాటిని కూడా కిరాయికి తీసుకుని ఉపయోగించాల్సిన దుస్థితి నెలకొంది. పోస్టుమార్టం రూం ఏర్పాటు చేసినప్పటికీ అందులో ఫ్రీజర్లు ఏర్పాటు చేయడం మరిచారు. ఇదిలా ఉండగా కొన్ని సంవత్సరాలుగా సేవలు అందించిన 104, ఆలన వాహనాలకు బదులుగా కొత్త వాహనాలను తీసుకువచ్చారు. పాత వాహనాలను పాత కలెక్టరేట్ సమీపంలో వదిలేయడంతో అవి తుప్పుపట్టి పోతున్నాయి. అంబులెన్స్‌ల సౌకర్యం కల్పించాల్సి ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తున్నాం..



మృత దేహాలను తలించే వాహనం రిపేర్‌కు రావడంతో హైదరాబాద్ తరలించి రిపేర్లు చేయిస్తున్నాం. మరో రెండు అంబులెన్స్ వాహనాలు ఉన్నప్పటికీ వాటిలో రోగులకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఆస్పత్రిలో మృతదేహాలను భద్రపరిచేందుకు ఫ్రీజర్ల ఏర్పాటుకు టెండర్లు సిద్ధమయ్యాయి. త్వరలోనే ఏర్పాటు చేయిస్తాం. – డాక్టర్ జగదీశ్వర్, ఆర్‌ఎంఓ

మత్స్యకార్మికుల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



చేపపిల్లలను పంపిణీ చేస్తున్న ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ రూరల్: మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిల్లంచర్ల శివారు రామప్ప చెరువులో ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత చేప పిల్లలను ఎంపీ బలరాంనాయక్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ.. బీసీలందరికీ ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, మత్స్యశాఖ జేడీ శ్రీనివాస్, జిల్లా మత్స్యశాఖ అధికారి బానోతు వీరన్న, సహదేవ్, ధనుంజయ, భయ్యా ఉపేందర్, అధికారులు శ్రీనివాస్, విష్ణు, రాజు, వేణు పాల్గొన్నారు.

గీత కార్మికులు బలోపేతం కావాలి

మరిపెడ: కల్లుగీత కార్మికులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని ఆడిటోరియంలో కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాల కిట్లను బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఎంపీ బలరాంనాయక్‌తో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఓ కిరణ్‌నాయక్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి శ్రీనివాస్, తాజుద్దీన్, ఐలయ్య, రాంలాల్ పాల్గొన్నారు.

మిశ్రమ పంటల సాగుతో రైతులకు లబ్ధి



వేప కషాయం పొడి పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త

మహబూబాబాద్ రూరల్: రైతులు ఎప్పటికీ ఒకే రకమైన పంటలు కాకుండా మిశ్రమ పంటలను సాగు చేసి ఆర్థికంగా బలపడాలని బెంగుళూరు ఉద్యాన పరిశోధన సంస్థ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ టీహెచ్ సింగ్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ పొన్నం నరేష్ అన్నారు. భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిశోధన సంస్థ అనుబంధ జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం ఆధ్వర్యంలో మల్యాల గ్రామ రైతువేదికలో శుక్రవారం మిరప రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి జినుగు మరియన్న, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాంబాబు, ఏఈఓ సరిత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణ పూర్తి చేసిన తర్వాతే డీఎస్సీ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎంఎస్పీ జాతీయ నాయకులు గుగ్గిళ్ల పీరయ్యమాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ చేపట్టకుండా డీఎస్సీ ఉద్యోగ నియామకాలు చేపట్టడం మాదిగలను మోసం చేయడమేనన్నారు. దేశంలో మొదటిగా వర్గీకరణ పూర్తి చేస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి కాలయాపన చేస్తూ వర్గీకరణపై మాటమార్చడం సరికాదన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయకుంటే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కత్తుల రేణుక, ఎండి. రజియా, పోలెపాక ప్రవీణ్, అబ్బూరి వినోద్‌రెడ్డి, చెలగోల వెంకన్న, ఇరుగు రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సమస్యలను విస్మరించిన ప్రభుత్వం



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

డోర్నకల్: డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేరుకుపోయిన సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు విస్మరించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్‌రావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీని శుక్రవారం స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించిన వెంటేశ్వర్‌రావు వైద్యాధికారి డాక్టర్ సాధ్విజతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. బడ్జెట్ కొరతతో ఆస్పత్రిలో సమస్యలు పేరుకుపోయాయని, ఆవరణలో మురుగునీటి గుంతలు ఏర్పడ్డాయని, ప్రహరీ కూలిందని, వైద్యులతోపాటు సిబ్బంది నియామకం చేపట్టాల్సి ఉందన్నారు. ఆర్టీఐ ద్వారా మున్సిపాలిటీ నిధుల వివరాలు సేకరించి నిధుల దుర్వినియోగంపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దేవానాయక్, మండల అధ్యక్షుడు గణేష్‌నాయక్, లక్ష్మినారాయణ, గఫూర్, రాయల రాంబాబు, నరేందర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ఒత్తిడికి లోనై యువకుడి ఆత్మహత్య

నెల్లికుదురు: ఒత్తిడికి లోనైన యువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బచ్చు శంకర్ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు బచ్చు సాకేత్ (22) ఆరునెలల క్రితం సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగంలో చేరినట్లు తెలిపారు. ఈ క్రమంలో చేస్తున్న ఉద్యోగంలో ఒత్తిడికి లోనై ఎవ్వరికి చెప్పుకోలేక తనలో తాను మదనపడి క్షణికావేశంలో గురువారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బచ్చు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కురవి: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామంలోని 365 జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కందికొండ గ్రామానికి చెందిన పర్శబోయిన భిక్షపతి అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై కందికొండ నుంచి కురవి మీదుగా మహబూబాబాద్‌కు వెళ్తున్నాడు. అదే మార్గంలో వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో భిక్షపతికి తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే గ్రామంలో ఉన్న వ్యక్తులు 108లో మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు



గార్ల: యువకుడిపై అదృశ్యం కేసు నమోదైన సంఘటన శుక్రవారం బొౖరసక్రుతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. మండలంలోని బొౖరసక్రుతండాకు చెందిన బానోత్ సాయి ఈనెల 1వ తేదీన ఖమ్మం వెళ్లి పురుగుమందులు తెస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి రాలేదు. నాటి నుంచి సాయి కోసం కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా అతని ఆచూకీ లభ్యం కాలేదు. ఈమేరకు సాయి తల్లి పద్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లక్ష్మీపురంలో క్షుద్రపూజల కలకలం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని లక్ష్మీపురం(బీ) గ్రామంలో క్షుద్రపూజలు చేస్తున్నారనే సమాచారం శుక్రవారం కలకలం రేపింది. గ్రామంలోని వ్యవసాయ భూముల్లో కొంత మంది వ్యక్తులు పసుపు కుంకుమలు చల్లి గురువారం అర్ధరాత్రి సమయంలో పూజలు చేయడానికి యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. వెంటనే అక్కడ ఉన్నవారు తాము ఎలాంటి క్షుద్ర పూజలు చేయడంలేదని, పుట్టమట్టి కోసం వచ్చామని తెలిపారు. గ్రామంలో కొంతమంది పూజల పేరుతో పంట పొలాల్లో పూజలు చేస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇలాంటి వ్యక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రూరల్ ఎస్సై దీపిక ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

కార్మికుల ధర్నా

కేసముద్రం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఎదుట సమస్యలను పరిష్కరించాలంటూ ఏఐసీటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నాకు దిగారు. ఈసందర్భంగా ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు కంచ వెంకన్న మాట్లాడుతూ.. మార్కెట్‌లో పనిచేసే కార్మికులందరికి మార్కెట్ ఆదాయం నుంచి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన ఇన్సురెన్స్ కట్టాలని ఆయన అన్నారు. అనంతరం స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దారావత్ రమేష్, వెంకన్న, వీరస్వామి, రాజు, కరుణాకర్ పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డీపీఈఓకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ రూరల్: గీత కార్మిక గ్రామాలలో సొసైటీలు, టీఎఫ్టీలు, అర్హులైన వృత్తి కార్మికులకు శిక్షణ ఇప్పించి వారికి సేఫ్టీ మోకులు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.కిరణ్ నాయక్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సమితి అధ్యక్షుడు దొంతు రామ్మూర్తి గౌడ్, ప్రధాన కార్యదర్శి చిర్ర వెంకటేశ్వర్లు గౌడ్, కోశాధికారి నక్క నాగార్జున గౌడ్ మాట్లాడారు. ప్రతి సొసైటీకి పది ఎకరాల భూమి ఇవ్వాలని, తాటి, ఈత, ఖర్జూర, గిరక తాళ్ల వనాలను పెంచాలన్నారు. గీత కార్మికులకు వృత్తి పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ప్రతి గీత సొసైటీ గ్రామాల్లో కల్లు మార్కెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల క్షేత్ర సందర్శన



చిత్రాలు గీసి రైతులకు వివరిస్తున్న విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వరంగల్ వ్యవసాయ కళాశాల, మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా మండలంలోని సండ్రాల గూడెం రైతువేదికలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. 2024–25 వార్షిక ఏడాదికి సంబంధించి వ్యవసాయ కళాశాల విద్యార్థులు సామాజిక మ్యాపులు, సీజనల్ క్యాలెండర్, కాలక్రమం, టైం లైన్ రైతువేదికలో గీసి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మల్యాల కేవీకే సమన్వయకర్త మాలతి, శాస్త్రవేత్తలు కిశోర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సంతోష్ కుమార్, అర్చన, స్వాతి, ఏఈఓ రంజిత్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచన లేని నూతన విద్య



మాట్లాడుతున్న బూర్ల ప్రదీప్

మహబూబాబాద్ అర్బన్: కేంద్రం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యారంగాన్ని ధ్వంసం చేస్తోందని అందులో శాస్త్రీయ విద్య ఆలోచన లేదని పీడీఎస్‌యూ వ్యవస్థాపక సభ్యుడు బూర్ల ప్రదీప్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన భవనంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం శతాబ్ది ఉత్సవ సభను నిర్వహించారు. ఈ సభకు పీడీఎస్‌యూ వ్యవస్థాపక సభ్యులు, ఇఫ్టూ జాతీయ ఉపాధ్యక్షుడు బూర్ల ప్రదీప్ హాజరై మాట్లాడారు. సమసమాజం నూతన ప్రజాస్వామ్య విప్లవం లాంటి ఉన్నత ఆశయాలతో ఏర్పడిన సంస్థ పీడీఎస్‌యూ అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, శ్రీనివాసులు, చుంచు శ్రీశైలం, వెంకన్న, ఐలయ్య, ఐలన్న, రమేష్, లింగ్యానాయక్, సామ పాపయ్య, విష్ణువర్ధన్, శ్రీనివాస్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

మహబూబాబాద్ అర్బన్: ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపీ బలరాంనాయక్‌కు శుక్రవారం వినతిప్రతం అందజేశారు. ఈసందర్భంగా వాకర్స్ గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ, ముఖ్య సలహాదారులు మైస శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎంపీ బలరాంనాయక్ స్టేడియం సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ అభివృద్ధికి రూ.30లక్షలు ఇవ్వడానికి హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షుడు నామిరెడ్డి వెంకట్ రెడ్డి, కోశాధికారి సోమ విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు రాచకొండ ఉపేందర్, పట్టాభి లక్ష్మయ్య, ఆవూనూరి రవి, కాసీం, వెంకటేశ్వర్లు, రవి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బయ్యారం ఎంపీడీఓగా విజయలక్ష్మి

బయ్యారం: బయ్యారం ఎంపీడీఓగా విజయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గార్ల ఎంపీఓగా పనిచేస్తున్న విజయలక్ష్మికి పదోన్నతి కల్పించి ఎంపీడీఓగా ఉన్నతాధికారులు నియమించారు.

జిల్లా ఈసీ అధ్యక్షుడిగా బన్సీలాల్



గూడూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లా ఇంజనీరింగ్ కన్సల్టెంట్ (ఈసీ) కమిటీ అధ్యక్షుడిగా గూడూరు మండల ఈజీఎస్ ఈసీ ధారావత్ బన్సీలాల్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బిందు, కోశాధికారిగా చెన్నూరి నరేష్, ఉపాధ్యక్షుడుగా ప్రదీప్‌కుమార్ ఎన్నికయ్యారు.

నివాళి

మహబూబాబాద్ రూరల్: టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్ చందర్ అకాల మరణంతో కాంగ్రెస్ పార్టీ మంచి నాయకుడిని కోల్పోయిందని ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. శుక్రవారం చుక్కల ఉదయ్ చందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఘనపురపు అంజయ్య, ఎండీ.ఖలీల్, వీరభద్రం, యాకూబ్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

దోర్నకల్: శరన్నవరాత్రి ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన మండపాల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని డోర్నకల్ ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ ఎన్.వీరేష్ కోరారు. మండపాల వద్ద అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.

యూరియా వాడకం తగ్గించాలి

గార్ల: వరిపంట ప్రస్తుతం పొట్టదశలో ఉన్నందున యూరియా వాడకం తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు సూచించారు. శుక్రవారం మండలంలోని ముల్కనూరు గ్రామ సమీపంలో వరిపంటలో ఆయన క్షేత్ర ప్రదర్శన చేశారు. క్షేత్ర ప్రదర్శనలో ఏఈఓలు కిరణ్, మేఘన, పూజిత, రైతులు పాల్గొన్నారు.

ఎంపీఓకు వినతి

గూడూరు: మండలంలోని అయోధ్యపురం గ్రామంలో మాజీ సర్పంచ్ చేపట్టని పనులకు బిల్లులు కాజేశాడని గ్రామస్తులు పూజారి శంకర్, రమేష్, శ్రీనివాస్, ప్రభాకర్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీఓ కార్యాలయంలో ఎంపీఓ సత్యనారాయణకు వినతపత్రం అందించారు.

పరిష్కార వేదిక సభ్యుడిగా రామారావు

దోర్నకల్: టీజీ ఎన్‌పీడీసీఎల్ వినియోగదారుల పరిష్కార వేదిక సభ్యుడిగా మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన మందనపు రామారావును నియమించారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషనర్ ఆదేశాలు జారీ చేసింది.

కళాశాలలో బతుకమ్మ సంబురాలు



మహబూబాబాద్ అర్బన్: బతుకమ్మ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో భాగమని, బతుకమ్మను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భూక్య ఉమ మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని దత్త ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ముద్ద మల్లేష్, ప్రిన్సిపాల్ బానోత్ మంగీలాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

గార్ల: మండలంలో ప్రతీరోజు గ్రామాల్లో నిర్వహించే వైద్యశిబిరాలను జ్వరపీడితులు, రోగులు సద్వినియోగం చేసుకోవాలని ముల్కనూరు పీహెచ్‌సీ డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ సూచించారు. శుక్రవారం మండలంలోని పూమ్యాతండా, పెద్దకిష్టాపురం, పాతపోచారం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

నెహ్రూసెంటర్: దళిత పేదల సమస్యల పరిష్కారం కోసం కేవీపీఎస్ దశలవారి ఉద్యమాలు నిర్వహిస్తుందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి అన్నారు. సంఘం ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పత్తిపాకలో సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహేందర్, వెంకన్న, ఆనంద్, శ్రీనివాస్, పరమేశ్, నాగరాజు పాల్గొన్నారు.

వెంకటమల్లు మృతి తీరని లోటు

నెల్లికుదురు: వెంకటమల్లు మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మండలంలోని నైనాల గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు ఏర్పుల వెంకటమల్లు ఆత్మహత్య చేసుకుని మృతి చెందగా శుక్రవారం దహన సంస్కారంలో పాల్గొన్నారు.

పరామర్శ..

కేసముద్రం: మండలంలోని భుక్యారాంతండాజీపీ శివారు కాలనీతండాకు చెందిన వాంకుడోతు జమ్లి అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. ఈమేరకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు.

నూకల నరేష్‌రెడ్డి మృతికి సంతాపం

మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు నూకల నరేష్‌రెడ్డి మృతికి మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీరా సీతారాం నాయక్, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాదవపెద్దిరెడ్డి శశివర్ధన్‌రెడ్డి, యలమంచిలి వెంకటేశ్వర్లు, మోసంగి మురళీ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు అందించాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ప్రభుత్వ ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో అవుట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు దసరా పండగకు పెండింగ్ వేతనాలు అందించాలని హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు బండి వసంత అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తప్పెట్ల వీరన్న, వెంకటనారాయణ, శ్రీలత, నాగరాజు పాల్గొన్నారు.

ఎర్రజెండాతోనే సమస్యల పరిష్కారం

నెల్లికుదురు: ప్రజాసమస్యల పరిష్కారం ఎర్రజెండాతోనే సాధ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మునిగలవీడు గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సీపీఎం గ్రామశాఖ 6వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బత్యం సత్యనారాయణ, గుణిగంటి రాజన్న, తిలక్ బాబు, సైదులు, బాబు గౌడ్, కిషన్, బిచ్చా, రామచంద్రు, ఉప్పలయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

కురవి: గ్రామాల్లో పేదల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కందికొండ గ్రామ సీపీఎం పార్టీ శాఖ మహాసభ కొర్ని మల్లమ్మ, అంబటిపూడి అనిల్ అధ్యక్షతన జరిగింది. నూతన కార్యదర్శిగా కొర్ని రాములు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కోటయ్య, సుధాకర్, కృష్ణయ్య, మల్లయ్య పాల్గొన్నారు.